క్లుప్తంగా

శ్మశానవాటికలో షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం కొయ్యగూరపాడు గ్రామంలోని శ్మశాన వాటికలో రూ.5 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న షెడ్డుకు బుధవారం గ్రామస్తులు భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన దోనేపూడి రంగారావు ఆర్థిక సహకారంతో షెడ్డు నిర్మాణం చేపట్టారు. శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా షెడ్‌ను నిర్మిస్తున్నట్లు సింధు కన్‌స్ట్రక్షన్ అధినేత కొరివి శ్రీను తెలిపారు. గ్రామస్తులు సంజీవరావు, మాచియ్య, పోలవరపు నాగేశ్వరరావు, డి.రంగారావు, బొరన్న తదితరులు పాల్గొన్నారు.

డయాబెటిక్ అండ్ న్యూట్రిషన్‌పై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ నందిని

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో డయాబెటిక్ అండ్ న్యూట్రిషన్‌పై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ నందిని ఆలపాటి మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా షుగర్ వ్యాధిని సంపూర్తిగా నిరోధించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్, ఫార్మసీ డీన్ డాక్టర్ కె.నరేందర్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జి.వర్ధీకాసులు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జి.శేఖర్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురై యువకుడి మృతి



హర్షవర్థన్(ఫైల్)

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరుకు చెందిన యువకుడు పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన గొల్లి శంకర్ అనే రైతుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు హర్షవర్థన్(18) డిప్లమో పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. గ్రామంలో జరిగే దసరా ఉత్సవాలు నిమిత్తం ఈ నెల 20న దుర్గాదేవి ప్రతిమను తీసుకువచ్చే ఊరేగింపులో హర్షవర్థన్ పాల్గొన్నారు. ఆ రోజు రాత్రి పాముకాటుకు గురి కావడంతో అతనికి గ్రామంలో ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించారు. తర్వాత రోజు అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హర్షవర్థన్ మరణంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో విద్యుత్ లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక విజయవాడ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎలక్ట్రికల్ లైన్‌మెన్ తీవ్రంగా గాయపడ్డాడు. కంటైనర్ లారీ ఆకస్మాత్తుగా అదుపు తప్పి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కొడాలి త్రిమూర్తులను ఢీ కొట్టింది. మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడిన లైన్‌మెన్‌ను స్థానికులు హుటాహుటిన విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ప్రస్తుతం షిఫ్ట్ ఆపరేటర్ బాధ్యతలను నిర్వహిస్తున్నాడు. ఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పోరంకిలో అంతర్గత రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. చెక్కా వారి రోడ్డు మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ రూ.31 లక్షలతో డ్రెయినేజీతో పాటు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. మున్సిపాలిటీలో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు. మున్సిపాలిటీ కమిషనర్ షేక్.నజీర్, ఇంజినీరింగ్ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు వరప్రసాద్ అష్టావధానం

విజయవాడకల్చరల్: శృంగేరీ జగద్గురువుల భారతీ తీర్థ మహాస్వామి ఆశీస్సులతో గురువారం శివరామకృష్ణ క్షేత్రంలో సహస్రావధాని డాక్టర్ వరప్రసాద్ అష్టావధానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ బుధవారం తెలిపారు. మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి సంచాలకులుగా అష్టావధానం జరుగుతుందని పేర్కొన్నారు.

ఆశలు.. కన్నీటి పాలు!

- అరటి రైతులకు అపార నష్టం
- ఈదురుగాలులు, భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట
- కోతకు సిద్ధంగా ఉన్న అరటి గెలలు నేల మట్టం
- భారీగా నష్టపోయిన రైతులు
- ప్రాథమిక అంచనాల నమోదులో అధికారులు



ప్రొద్దుటూరులో దెబ్బతిన్న అరటితోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి హర్‌చంద్



గోసాలలో నేలమట్టమైన అరటి తోట

కంకిపాడు: సీజన్ ఏదైనా రైతులకు ఇబ్బందులు మాత్రం తప్పటం లేదు. ప్రకృతి ప్రకోపానికి అన్నదాతలు చితికిపోతున్నారు. తాజాగా ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం అరటి రైతులకు అపార నష్టం మిగిల్చింది. కోతకు సిద్ధంగా ఉన్న అరటి పంట నేల మట్టం కావటంతో అన్నదాతలు భారీగా నష్టపోయారు. ప్రాథమికంగా పంట నష్టం నమోదు అంచనాల్లో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు.

వెన్నువిరిగిన అరటి రైతు..

కృష్ణా జిల్లా వ్యాప్తంగా పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లో అరటి సాగు జరుగుతోంది. ప్రధానంగా కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు లంక గ్రామాలు, కరకట్ట వెంబడి గ్రామాల్లో అరటి సాగవుతోంది. కూర అరటి, తినే అరటి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట గెలల మీద ఉంది. అదును రాగానే గెలలు కోసి మార్కెట్‌కు తరలించేందుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల ద్రోణి ప్రభావంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీని ప్రభావంతో కోతకు సిద్ధంగా ఉన్న అరటి తోటలు నేల మట్టం అయ్యాయి. చేతికొచ్చిన పంట నేలవాలి గెలలు దెబ్బతినటంతో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది.

పరిహారం అందించి ఆదుకోవాలి..

80 సెంట్ల విస్తీర్ణంలో అరటి తోట సాగు చేస్తున్నా. మొన్న కురిసిన భారీ వర్షం, ఈదురుగాలులకు కోతకు వచ్చిన అరటి చెట్లు విరిగిపోయాయి. భారీగా నష్టం వాటిల్లింది. పంట నష్టం నమోదు చేపట్టి నష్టపోయిన రైతులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలి. పరిహారం అందించి భరోసా కల్పించాలి.

– తిమ్మారెడ్డి, రైతు, ప్రొద్దుటూరు

అంచనాలు నమోదు చేస్తున్నాం..

భారీ వర్షం, ఈదురుగాలులకు కొన్ని ప్రాంతాల్లో అరటి తోటలు నేలమట్టం అయ్యాయి. కోత దశలో పంటకు నష్టం జరిగింది. అధికారులకు ఇప్పటికే సూచనలు ఇచ్చాం. క్షేత్రస్థాయిలో పంట నష్టం వివరాలను ప్రాథమికంగా నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం.

– జి.జ్యోతి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, కృష్ణాజిల్లా

ప్రాథమిక అంచనాల్లో అధికారులు..

అరటి పంట దెబ్బతినటంతో జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. పంట నష్టం వివరాలను ప్రాథమికంగా నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి అధికారులు వివరాలను సేకరిస్తున్నారు. కోత దశలో ఉన్న పంట దెబ్బతినటంతో తమను పూర్తి స్థాయిలో ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కోలుకోని దెబ్బతో విలవిల..

వరుసగా సంభవిస్తున్న ప్రకృతి విపత్తులతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఈ ఏడాది మే నెలలో కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోయారు. నష్టాన్ని అధిగమించి, తిరిగి సాగు చేపట్టిన రైతులకు వరుసగా ముంచుకొస్తున్న విపత్తులతో నష్టం జరుగుతోంది. మే నెలలో అకాల వర్షానికి కృష్ణాజిల్లాలో వివిధ రకాల పంటలు 92.40హెక్టార్లలో దెబ్బతిన్నాయి. 127 మంది రైతులకు నష్టం వాటిల్లింది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి అరటి తోటలకు నష్టం జరిగింది. అధికారులు మొక్కుబడిగా పంట నష్టం వివరాలను నమోదు చేయకుండా పూర్తి స్థాయిలో పంట నష్టం నమోదు చేసి తమను ఆదుకోవాలన్న డిమాండ్ రైతుల నుంచి వ్యక్తమవుతుంది.

కార్మికుల పని గంటలు పెంపు దుర్మార్గం



పెద్దఅవుటపల్లి(గన్నవరం): రాష్ట్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ పని గంటలు పెంచడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని పెద్దఅవుటపల్లి క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక సంఘాలతో కనీస చర్చలు జరపకుండనే 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 10 నుంచి 13 గంటల వరకు పని చేయించుకోవచ్చని చట్టం చేయడం అన్యాయమన్నారు. కార్పొరేట్ శక్తులకు మేలు జరిగే విధంగా ప్రభుత్వం చట్టాలను మార్చుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల పక్షాన ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు వేట శ్రీనివాసరావు, కె.రామరాజు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్‌లో విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ రామ్మూర్తి తెలిపారు. ఆయన బుధవారం వివరాలు తెలుపుతూ పోరంకి పరిధి రామాపురం ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. దీని కారణంగా గ్రామంలో సాలిపేట రోడ్డు, పెనమలూరు సెంటర్, రామాపురంకాలనీ, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందన్నారు. స్థానికులు సహకరించాలని కోరారు.

శివ స్వరూపిణీ.. మాతా అన్నపూర్ణేశ్వరీ



ప్రొద్దుటూరు శివాలయంలో అన్నపూర్ణాదేవిగా..



అన్నపూర్ణాదేవిగా పేరంటాలమ్మ



కంకిపాడులో గాయత్రీదేవిగా వాసవీమాత



కంకిపాడు శివాలయంలో..



నున్న కనకదుర్గ దేవస్థానంలో అన్నపూర్ణాదేవి



గన్నవరం వాసవీమాత మందిరంలో..

శివ స్వరూపిణీ.. మాతా అన్నపూర్ణేశ్వరీ అంటూ భక్తులు అమ్మవారికి విశేష పూజలు జరిపించారు. దేవీ శరన్నవరాత్రుల్లో మూడో రోజైన బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లోని ఆలయాలకు, ఉత్సవ పందిళ్లకు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని విశేష పూజలు, హోమాలు నిర్వహించారు.

– కంకిపాడు/పెనమలూరు/ఉయ్యూరు/గన్నవరం/రామవరప్పాడు /నున్న(విజయవాడరూరల్)



ఉయ్యూరు విజయదుర్గాదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవి



ఉయ్యూరు శివాలయంలో గజలక్ష్మీదేవి



యనమలకుదురులో అన్నపూర్ణాదేవిగా..



పోరంకి గంగానమ్మ గుడి వద్ద అన్నపూర్ణాదేవి



మద్దూరులో అన్నపూర్ణాదేవిగా..

సమస్యల పరిష్కారం కోరుతూ న్యాయవాదుల ధర్నా



గన్నవరంలో ధర్నా చేస్తున్న న్యాయవాదులు

గన్నవరం: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ పిలుపు మేరకు రాష్ట్రంలో న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది అనుమోలు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అద్దె భవనాల్లో నడుస్తున్న కోర్టుల స్థానంలో శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు. తెలంగాణలో మాదిరిగా రాష్ట్రంలో మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వడంతో పాటు జూనియర్ న్యాయవాదుల భృతి, లా నేస్తం నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.100 కోట్లు గ్రాంట్‌ను ఏపీ బార్ కౌన్సిల్‌కు జమచేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు డి.బదరినాథ్, ఎస్‌పీ సాంబశివరావు, యు.సక్కుబాయి, టి.వెంకయ్య, జి.భాస్కర్‌రావు, ఈ.వాసుదేవరావు, ఎ.కృష్ణకిషోర్, జె.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవ చేయాలి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఉపకులపతి వెంకటేశ్వరరావు తదితరులు

పెనమలూరు: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవపై దృష్టి సారించాలని సిద్ధార్థ డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. యూనివర్సిటీలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్ఎస్ఎస్ యువతలో సేవా భావం పెంచుతుందన్నారు. గత సంవత్సరం ఉత్తమ ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా గుర్తింపు పొందిన పవన్‌కుమార్‌కు ప్రశంసాపత్రంతో పాటు విజయవంతంగా సేవా కార్యక్రమాలు పూర్తి చేసిన 100 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్ఎస్ఎస్ పూర్వ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్రను సన్మానించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రో.ఉపకులపతి డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జె.శివరామ్‌ప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు కె.మాధవి, పి.సుష్మాచౌదరి, ఎ.వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ పూర్వ కమిషనర్లపై అవినీతి ఆరోపణలు

- ఒకరిపై నేడు విచారణ
- మరో ఇద్దరికి నోటీసులు



తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పూర్వ కమిషనర్లపై పరిపాలనలో లోపాలతో పాటు అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీనిపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ విచారణకు ఆదేశించారు. ముగ్గురిలో ఒకరిపై గురువారం విచారణ జరగనుండగా, మరో ఇద్దరికి నోటీసులు జారీ చేశారు.

జరిగింది ఇదీ..

తాడిగడప మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత పలువురు కమిషనర్లు ఇక్కడ పని చేశారు. మొదటి కమిషనర్‌గా డి.వెంకటలక్ష్మి, ఆ తరువాత ఎస్.ప్రకాశరావు, ఎం.వెంకటేశ్వరరావులు పని చేశారు. అయితే వీరి పని తీరుపై ఆరోపణలు వచ్చాయి. డి.వెంకటలక్ష్మి మున్సిపాలిటీలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని ఆరోపణలు రావటంతో ప్రభుత్వం గత జూలైలో జీవో 714 విచారణకు జారీ చేసింది. ఆమెకు నోటీసు ఇచ్చారు. వెంకటలక్ష్మి రెండున్నర నెలలు మాత్రమే పని చేశారు. ఆమె పాలనలో జరిగిన లోపాలపై పూర్తి వివరాలతో సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. అదే విధంగా ఎస్.ప్రకాశరావు కమిషనర్‌గా ఉన్న కాలంలో మున్సిపాలిటీ నిధులు విత్‌డ్రా చేసి ఖర్చు చేసిన సొమ్ముకు సంబంధించి ఓచర్లు సమర్పించలేదని, ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ప్రకాశరావు మూడేళ్లు కమిషనర్‌గా పని చేశారు. ప్రకాశరావుపై వచ్చిన ఆరోపణలకు జీవో 715 ద్వారా నోటీసులు జారీ చేశారు.

నేడు విచారణ

గతంలో కమిషనర్‌గా పని చేసిన ఎం.వెంకటేశ్వరరావుతో పాటు టౌన్‌ప్లానింగ్ అధికారి బి.మురళీగౌడ్, సూపర్‌వైజర్ వై.పద్మావతి(విశ్రాంత అధికారి)పై కూడా ఆరోపణలు వచ్చాయి. వీరు నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాల ప్లాన్‌లు మంజూరు చేశారని వీరి పై జీవో 611లో పై చార్జ్‌లు చూపుతూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిపై వచ్చిన ఆరోపణలను విచారించాలని వీఎంసీ సీసీపీ ప్రస్తుతం మంగళగిరి హెడ్ ఆఫీస్‌లో పని చేస్తున్న జీవీజీఎస్‌వీ.ప్రసాద్‌ను విచారణ అధికారిగా నియమించారు. మంగళగిరి డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ కార్యాలయంలో గురువారం విచారణ జరగనుంది. ఈ విషయమై కమిషనర్ నజీర్‌ను వివరణ కోరగా గురువారం విచారణ జరుగుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు.

ప్రస్తుత అవినీతిపై విచారణ ఉంటుందా..?

మున్సిపాలిటీలో కూటమి పాలన వచ్చిన తరువాత జరుగుతున్న భారీ అవినీతి ఆరోపణలపై విచారణ చేస్తారా అని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అక్రమ లే అవుట్లు, అనధికార భవనాల నిర్మాణం భారీగా జరుగుతున్నందున వీటిపై కూడా విచారణ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. తాడిగడప మున్సిపాలిటీపై పూర్తి స్థాయిలో విచారణ, చర్యలు జరిగితేనే కానీ అవినీతిని నిర్మూలించలేరని ప్రజలు వాపోతున్నారు.





గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఉదయం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు వల్లభనేని వంశీమోహన్, దేవభక్తుని చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్ వర్క్

పంచాయతీలో పలు అంశాలు తీర్మానం

రామవరప్పాడు: స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ వరి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో పలు అంశాలు తీర్మానించారు. తొలుత పంచాయతీ కార్యదర్శి సత్యబాబు అజెండాలోని పలు అంశాలను పాలకవర్గ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా మెజార్టీ పాలకవర్గ సభ్యులు పలు అంశాలను తీర్మానించారు. ప్రధానంగా జూన్, జులై, అగస్టు నెలల్లో నగదు జమ, ఖర్చులు పరిశీలించి ఆమోదించే అంశం, పారిశుద్ధ్య పనులు నిమిత్తం ప్రజారోగ్య సామగ్రి కొనుగోలు, ఖాళీ స్థలాల్లో చెత్తను తొలగింపు చర్యలకు, పలు అంతర్గత రహదారుల అభివృద్ధికై పాలకవర్గ సభ్యులు తీర్మానించారు.

కక్షపూరిత చర్యలు మానుకోవాలి

వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సభ్యులపై జరుగుతున్న కక్ష పూరిత చర్యలను మానుకోవాలని 7వ వార్డు సభ్యురాలు లోకసాని లక్ష్మి సమావేశంలో తమ గోడు వెళ్లబోసుకున్నారు. టీడీపీ వార్డు సభ్యుడు కొంగన రవి, నాయకులు నభిగాని కొండ తనపై ఉద్దేశ పూర్వకంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సమావేశంలో తెలిపారు. దీంతో పాలకవర్గ సమావేశంలో లక్ష్మి, కొంగన రవి మధ్య వాదోపవాదాలు జరిగాయి. గ్రామంలోని రైవస్ కాలువ వంతెన సమీపంలో తమ పాల బూత్‌ను వీరు బలవంతంగా తొలగించారని, మిగతా షాపులు మాత్రం ఎందుకు తొలగించలేదని లక్ష్మి ప్రశ్నించారు. తాము వైఎస్సార్ సీపీకి చెందిన వాళ్లం కావడంతో టార్గెట్ చేసి జీవనాధారంపై దెబ్బకొట్టారన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేరు చెప్పి టీడీపీ నాయకులు గ్రామంలో అలజడులు సృష్టిస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తమ పాల బూత్‌ను తొలగించిన పంచాయతీ అధికారులు తిరిగి స్థలం కేటాయించాలని ఆమె కోరారు.

జంక్షన్‌లో దొంగల హల్‌చల్



హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. స్థానిక విజయవాడ రోడ్డులోని కిక్ వైన్స్, ఆల్ఫా ఇరానీ ఛాయ్ దుకాణాల్లో వరుసగా చోరీలకు పాల్పడ్డారు. కిక్ వైన్స్ షాపునకు వెనుక వైపున షట్టర్ తాళాలను పగులకొట్టి దుండగులు షాపులోకి ప్రవేశించారు. సుమారు రూ.13 వేలు విలువ చేసే మద్యం బాటిళ్లు, మరికొంత నగదును అపహరించారు. మద్యం దుకాణం బయట ఉన్న బడ్డీ కొట్టు డోర్లు కూడా ధ్వంసం చేసి, దానిలోని సామగ్రి, నగదు దొంగిలించారు. వైన్ షాపు పక్కనే ఉన్న ఆల్ఫా టీ స్టాల్‌కు చెందిన పాన్ షాపులోనూ చోరీకి పాల్పడ్డారు. ఆల్ఫా పాన్‌షాపు తాళాలు పగలు కొట్టి, దానిలోని సొత్తును అపహరించారు. ఈ వరుస చోరీ సంఘటనలు హనుమాన్‌జంక్షన్‌లో బుధవారం కలకలం రేపాయి. చోరీలపై ఆయా దుకాణాల యాజమానులు ఇచ్చిన ఫిర్యాదుపై హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.